# తెలంగాణ రక్షణ సేన (TRS) ఆధ్వర్యంలో ఘనంగా 'జెండా పండగ'







- **నేరడిగొండ లో జెండా ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు**
- **కార్యకర్తలు నూతన ఉత్సాహము నిపెందుకు జెండా పండగలు**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ నేరడిగొండ)**

తెలంగాణ రక్షణ సేన సగర్వంగా నిర్వహించిన 'జెండా పండగ' వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటాయి.తెలంగాణా రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాను సారం బోథ్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జెండా పండగ కార్యక్రమలు అబరాన్ని అంటాయి.ఉద్యమ స్ఫూర్తిని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను శ్రేణులు అత్యంత వైభవంగా నిర్వహించాయి.మండల, గ్రామ కేంద్రాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించి, తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఉత్సాహంగా సాగిన వేడుకలు ఈ ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి గల్లీ, కూడలి ఆకుపచ్చ, పసుపుపచ్చ, నీలి రంగు తోరణాలు, జెండాలతో ముస్తాబయ్యాయి. జెండా ఆవిష్కరణ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉదయాన్నే జెండాలను ఆవిష్కరించి, "తెలంగాణ రక్షణ సేన జిందాబాద్ " అంటూ నినాదాలు చేశారు. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జెండా పండగను లక్ష్య సాధనే ధ్యేయం ముఖ్య నేతల ప్రసంగం ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన బోథ్ ఇంచార్జ్ రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ తెలంగాణ హక్కుల రక్షణే ధ్యేయంగా ఈ జెండా ఎగిరిందని గుర్తుచేశారు. మన జెండా కేవలం ఒక వస్త్రం కాదు అది కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, ఆత్మ గౌరవానికి ప్రతిరూపం. నీళ్లు, నిధులు, నియామకాల సాధనలో ఈ జెండా పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుంది." రాబోయే రోజుల్లో కూడా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో కొత్త జోష్ఈ జెండా పండగ ఉత్సవాలు తెలంగాణ రక్షణ సేన శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.బానోత్ వసంత్ రావు అల్లం విలాస్,తిక్కరెడ్డి రాజేందరరెడ్డి, ముస్తఫా, మారుతీ, జ్ఞానేశ్వర్,గుతంరెడ్డి, భానుచంద్,పోచన్న గడుగు, లాగిడే సచిన్, ముస్కు గంగారెడ్డి, సూరియాప్రకాస్ రాథోడ్ సంతోష్, సయ్యద్, ఆడే మహేష్, జింక నరేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మోడల్ వెజిటేబుల్ మార్కెట్‌కు శ్రీకారం

- **స్థలాన్ని పరిశీలించిన ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్**

**డిడి9 వార్త గుడిహత్నూర్**

గురువారం మండల కేంద్రంలోని ప్రజలకు, స్థానిక మరియు చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఆధునిక వసతులతో కూడిన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ తెలిపారు. గురువారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో మంజూరైన "మోడల్ వెజిటేబుల్ మార్కెట్" నిర్మాణ స్థలాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా సువిశాలమైన, అన్ని హంగులతో కూడిన వెజిటేబుల్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ మార్కెట్ ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మార్కెట్ నిర్మాణంతో మండలంలో నూతన ఉపాధి అవకాశాలు ఏర్పడి, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. రైతులు తమ కూరగాయలను నేరుగా విక్రయించుకునే వేదికగా ఈ మార్కెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ గ్రామ సర్పంచ్ ఆడే శీల, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు నాగనాథ్, అప్ప, అంకత్ రవి, కారాడ్ బ్రహ్మానంద, ఆడే జైపాల్, మహేందర్, జాదవ్ రాధే శ్యామల, చిట్యాల గంగన్న తదితరులు పాల్గొన్నారు.



## వేరువేరు కారణాలతో మరణించిన వ్యక్తుల కుటుంబాలను పరామర్శించిన డా. నరేష్ యాదవ్

**డిడి 9 వార్త గుడిహత్నూర్**

మండలం తోషం గ్రామానికి చెందిన బడే సుగ్రీవ్ అలాగే తోయగూడకు చెందిన పెందుర్ లక్ష్మణ్ షేక్ బాయి ఇటీవల స్వర్గస్తులవడంతో వారి కుటుంబ సభ్యులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తొడషం దౌలత్ రావు , కారాడే బ్రహ్మానంద్ , చిట్యాల గంగన్న , జాదవ్ రాధే శ్యామ్ , శ్రీకాంత్ జాదవ్ , బండారి సతీష్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మికతకు, ఆరోగ్యానికి నిలయం ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**



ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం కేవలం భక్తికి నిలయం మాత్రమే కాదు, అదొక ఆరోగ్య ప్రదాయిని. ఆలయమంటే కేవలం దైవదర్శనాలకు మాత్రమేనని భావించే నేటి సమాజానికి, సంస్కృతిని, సంస్కారాన్ని, ఆరోగ్యాన్ని మేళవించిన జీవన కేంద్రంగా ఆ క్షేత్రం దారి చూపుతోంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోదరులైన నరసింహారెడ్డి గారు తన స్వగ్రామం నరసింగపల్లిలో ఈ క్షేత్రాన్ని నెలకొల్పి, ఆధునిక సమాజానికి మూలాలను గుర్తు చేస్తున్నారు.

పుష్యమి నక్షత్రం రోజున చిన్నారులకు అందించే స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం ద్వారా, భావి భారత పౌరులను శారీరక, మానసిక దృఢత్వం గలవారిగా తీర్చిదిద్దుతున్నారు. శాస్త్ర పరిజ్ఞానానికి సవాలు విసురుతూ, మాఘ పౌర్ణమి నాడు ఇచ్చే సంతాన ప్రాప్తి ఔషధం ద్వారా ఎందరో దంపతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఆధ్యాత్మికతను ప్రకృతితో మమేకం చేసి ఆహారమే ఔషధమనే సత్యాన్ని చాటి చెబుతూ కనుమరుగవుతున్న అరుదైన వృక్షజాతులను, ఔషధ మొక్కలను కాపాడుతున్న నరసింహారెడ్డి నిజమైన ధన్వంతరి స్వరూపంగా సేవలందిస్తున్నారు. ప్రకృతి సేద్యం, ఆధ్యాత్మిక పరిపుష్టి కలగలిసిన ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం, నేడు సమాజానికి ఒక దిక్సూచిగా నిలుస్తోంది.







## వానాకాలం సాగుపై అవగాహన సదస్సు

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' నినాదంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన కార్యక్రమం భీంగల్ మండలంలోని జాగీర్యాల గ్రామంలో పండుగలా సాగింది. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 30న మొదలైన ఈ అవగాహన సదస్సు మే 23 వరకు కొనసాగుతుండగా, తాజాగా జాగీర్యాల గ్రామంలో రుద్రూరు పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతులకు దిశానిర్దేశం చేశారు.

కేవలం దిగుబడి పెంచడమే కాదు మార్కెట్లో ఏ పంటకు డిమాండ్ ఉందో తెలుసుకుని సాగు చేయడమే అసలైన వ్యవసాయమని రుద్రూరు శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య రైతులకు హితవు పలికారు. విశ్వవిద్యాలయం సిఫార్సు చేసిన నాణ్యమైన విత్తన రకాలను ఎంచుకుంటేనే మార్కెట్లో గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే రసాయనాల మోతాదు తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, జీవ ఎరువులు, పంట మార్పిడి, మల్చింగ్ వంటి పద్ధతులతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించవచ్చని, ఇది దీర్ఘకాలంలో రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందని వివరించారు. రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులు ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి బి. లావణ్య గారు కోరారు. ముఖ్యంగా సన్న రకాలుగా బిపిటి5204, ఆర్ఎన్ఆర్15048, కెఎన్ఎం1638, జైశ్రీరామ్, హెచ్ఎంటి, డబ్ల్యుజిఎల్962, డబ్ల్యుజిఎల్44, జెజిఎల్ 1798 వంగడాలను, అలాగే దొడ్డు రకాలుగా ఐఆర్64, ఎమ్‌టియు1010, కెఎన్ఎం118 వంగడాలను మాత్రమే వేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి ఎం. దివ్య, జాగీర్యాల గ్రామ సర్పంచ్ జి. ప్రసాద్, ఉప సర్పంచ్ భాస్కర్, పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తల సూచనలను రైతులు ఆసక్తిగా ఆలకించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## నేడు బోధన్ లో హిందూ సమ్మేళనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని బురుడు గల్లిలో ఉన్న విష్ణు మందిరం వద్ద శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా సద్గురు సోమలింగ శివాచార్య స్వామీజీ విచ్చేయనున్నారని పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.



## సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**



భీమ్‌గల్ మండలం ముచ్కూర్ సొసైటీ ఆ ధ్వ ర్యం లో గురువారం రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు బంగ్లా దేవేందర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సొసైటీ ద్వారా నిరంతరం అందుబాటులో ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బురెడీ గంగారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## బోథ్ CHC లో మాతా శిశు సంక్షేమమే కేంద్రం ప్రారం బోత్సవం mp జి: నగేష్ .

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 21(డి డి 9 వార్త ):-**

ఈ రోజూ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గౌరవ గోడం నగేష్. ఈరోజు బోథ్ మండల కేంద్రంలోని హాస్పిటల్లో మదర్ ఫీడింగ్ సెంటర్ (మాత శిశువుల పాలిచ్చే గది) ని ప్రారంభించారు.వారితో బిజెపి పాటు జిల్లా అధ్యక్షులు మాజీ జడ్పిటిసి పతంగి బ్రహ్మానందం పార్టీ, PACS చైర్మేన కదం ప్రశాంత్, డాక్టర్ ప్రసాద్ , రైల్వే బోర్డ్ మెంబర్ గణేష్ భోసారె, కేంద్రీ శివ, కనపర్తి చంద్రకాంత్ .జాదవ్ రమేష్, మల్లికార్జుణ. రాజేశ్వర్ రెడ్డి. వెంకటేష్ జుగాదిరావు అడ్వకెట్ శంకర్ . జకుల వెంకటేష్ .రామారావు .గంగారాం తోపాటు అధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పారదర్శకత, వేగం ఉండాలి

- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్**

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ నిర్వహించిన సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయిలో సేవలను మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులతో జూమ్ ద్వారా నిర్వహించిన ఈ భేటీలో, మాతా శిశు మరణాలను అరికట్టేలా ప్రతి ప్రసవం ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని కమిషనర్ స్పష్టం చేశారు. గర్భిణీలకు కనీసం నాలుగుసార్లు వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్రమాదకర స్థితిలో ఉన్నవారిని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే పరీక్షలు, మంగళవారం చేపడుతున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళల జీవనశైలి వ్యాధులు, గర్భాశయ సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలని పేర్కొన్నారు. లింగ వివక్షను అరికట్టేందుకు పిండలింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని హెచ్చరించారు. వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం లక్ష్యంతో అందించాలని, 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎమ్మార్ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, వైకల్యం గల పిల్లలను ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు రీఫర్ చేయాలని సూచించారు. క్షయ రహిత గ్రామాల ఏర్పాటు లక్ష్యంగా ప్రతిరోజూ మొబైల్ ఎక్స్‌రేల ద్వారా పరీక్షలు నిర్వహించాలని, అలాగే టెలీ మానస్ కాల్స్ ద్వారా మానసిక ఆరోగ్య సేవలను విస్తృతం చేయాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌లో సేవల నమోదును వేగవంతం చేయాలని, వైద్య సేవలన్నీ జిల్లా స్థాయిలో డిజిటలైజ్ చేసేలా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా స్థాయి వైద్య ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, వైద్య బృందాలు పాల్గొన్నారు.

## మామను హత్య చేసిన అల్లుడికి పదేళ్ల జైలు శిక్ష

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

నవీపేట్ మండలం అనంతగిరి గ్రామానికి చెందిన బిలమసింగ్ హత్య కేసులో నిందితుడైన అల్లుడు రాజేష్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. నేరం రుజువు కావడంతో నిజామాబాద్ ఉమెన్స్ కోర్టు ఈ మేరకు తీర్పు వెలుసూచించేవారు కేసు వివరాల్లోకి వెళ్తే, తిమ్మసముద్రం ప్రాంతంలో కూలీ పనులు చేసుకుంటున్న బిలమసింగ్, తన కుమార్తెను సక్రమంగా చూసుకోవాలని అల్లుడు రాజేష్‌కు పదేపదే సూచించేవారు. ఈ విషయమై 2025 ఏప్రిల్ 27న ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగగా, ఆగ్రహంతో రాజేష్ ఇటుకతో బిలమసింగ్ తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన బిలమసింగ్ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనపై నవీపేట్ పోలీసులు కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తు జరిపి నిందితుడిపై ఛార్జిషీట్ దాఖలు విచారణ చేపట్టిన మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి డి.దుర్గాప్రసాద్, ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించి రాజేష్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.నీరజ, నవీపేట్, ధర్పల్లి పోలీసు అధికారులను, కోర్టు డ్యూటీ సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు.

## టీఎన్జీవోస్ జిల్లా ఆఫీస్ సెక్రటరీగా కుంట శ్రీనివాస్ నియామకం

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

టీఎన్జీవోస్ భీమ్‌గల్ ఏరియా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్న కుంట శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పిస్తూ ఆయనను టీఎన్జీవోస్ జిల్లా ఆఫీస్ కార్యదర్శి గా నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంగా కుంట శ్రీనివాస్ మాట్లాడుతూ...తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, అందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించిన జిల్లా కార్యదర్శి శేఖర్, కేంద్ర సంఘం బాధ్యులు పోలా శ్రీనివాస్, జాఫర్ హుస్సేన్, ఎలక్షన్ అధికారి వనమాల సుధాకర్, వివిధ యూనిట్ల అధ్యక్షులు, ఐకేపీ జేఏసీ ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, గ్రామ సంఘ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.




# హెచ్ఐవి బాధితులకు మెరుగైన వైద్య సేవలు








- **హెచ్ఐవి బాధితులకు మెరుగైన వైద్య సేవలు**

**నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (GGH)లో హెచ్ఐవి బాధితులకు అందుతున్న సేవలపై రాష్ట్ర స్థాయి అధికారులు సమీక్ష నిర్వహించారు. జేడీ బేసిక్ సర్వీసెస్ డాక్టర్ జయలక్ష్మి మరియు మొబిలైజేషన్ ఎయిడ్స్ సురక్ష స్టేట్ సమన్వయకర్త ఆది కామేశ్వరరావు నిజామాబాద్‌లోని ఏఆర్టీ కేంద్రాన్ని సందర్శించి, పేషెంట్లకు క్రమం తప్పకుండా మందులు అందేలా చూడాలని, వైరల్ లోడ్ పరీక్షలు సకాలంలో నిర్వహించాలని వైద్యులకు సూచించారు. నిజామాబాద్ ఏఆర్టీ కేంద్రం 99 శాతం లక్ష్యంతో పనిచేస్తుండగా, మిగిలిన 5 శాతం గ్యాప్‌ను కూడా పూడ్చితే రాష్ట్రంలోనే అత్యుత్తమ కేంద్రంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం అధికారులు సురక్ష క్లినిక్, సంపూర్ణ సురక్ష కేంద్రం మరియు ఐసీటీసీ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న కౌన్సెలింగ్, చికిత్స పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రాజశ్రీతో సమావేశమై, నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీలకు హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్ బి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించి, ఆ వివరాలను హెచ్ఎంఐఎస్ లో నమోదు చేయాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా డిచ్‌పల్లిలోని మానవతా సదన్‌ను సందర్శించి చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, డాక్టర్ దేవి నాగేశ్వరి, జిల్లా ఉప వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## మండల టాపర్ వేదశ్రీ కి కోనేరు శశాంక్ సైకిల్ బహుమతి

**నిజాంబాద్ పోతంగల్ మే 21(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో కుమ్మరి లాలయ్య గారి కుమార్తె అయినటువంటి వేదశ్రీ మండల టెన్త్ టాపర్‌గా నిలిచిన సందర్భంగా కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నారై కోనేరు శశాంక్ గారి చేతుల మీదుగా సైకిల్ ను బహుమతిగా అందజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ట్రస్ట్ బృందం ప్రకాష్ పటేల్ , సున్నం సాయిలు , వేముల నవీన్, ఆలపాటి హరికృష్ణ , , కల్లూరి బజరంగ్, గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య గారు,పబ్బ శేఖర్, గంగం కిరణ్ సెట్ , గోవుర్ రమేష్, ప్రధానోపాధ్యాయులు సాయిలు , ఉపాధ్యాయులు నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు



## బోధన్‌లో రాజీవ్ గాంధీకి ఘన నివాళి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్‌గాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తూము శరత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఆధునిక సాంకేతిక రంగానికి పునాదులు వేసిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాషా మోహినుద్దీన్, నాయకులు హరికాంత్ చారి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, ఐరెన్ల శంకర్, రవి, ఇమ్రాన్ షరీఫ్, అహ్మద్, తల్లరి నవీన్, రామ్మూర్తి, శ్రీనివాస్ రెడ్డి, అక్షయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## కుమ్మన్‌పల్లిలో అభివృద్ధి పనుల పరిశీలన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

సాలూర మండల పరిధిలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న వీఓఎస్‌హెచ్‌జీ మహిళా సమాఖ్య భవనంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, స్థానికులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని చిన్న నీటి పారుదల చెరువును పరిశీలించి, నీటి నిల్వ సామర్థ్యం, సాగునీటి వనరుల లభ్యతపై ఆరా తీశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రగతి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ఎండీపీఓ పేర్కొన్నారు.

## సాలూర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా , మే 21(డీడీ9 వార్త) :**

రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సాలూర అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. బోధన్ రూరల్ ఎస్ఐ మశ్చేందర్ రెడ్డి అదేశాల మేరకు గురువారం సరిహద్దు దాటి వచ్చే అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు తెలంగాణమహారాష్ట్ర సరిహద్దు గుండా ప్రయాణించే లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి సోదాలు నిర్వహించారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అక్రమ రవాణాకు తావులేకుండా ఉండేందుకే ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఎస్సై ప్రశాంత్ రెడ్డి, అనిరుద్ద్, సతీష్, మనోజ్, అమరేంధర్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



## సేంద్రీయ వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తి

- **'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' సదస్సులో కేవీకే శాస్త్రవేత్త డా. ఇందుధీర్ రెడ్డి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 21(డీడీ9 వార్త) :**

నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తికి సేంద్రీయ వ్యవసాయమే ఏకైక మార్గమని కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూరు శాస్త్రవేత్త డాక్టర్ కె.ఇందుధీర్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా సాలూర గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, రసాయన ఎరువులు, కీటకనాశకాలకు స్వస్తి పలికి పూర్తిగా సహజ వనరులు, ప్రకృతి ఆధారిత పద్ధతులతో పంటలను సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువుల వినియోగంతో పాటు సహజ కీటక నియంత్రణ, పంట మార్పిడి, మిశ్రమ పంటలు, మల్చింగ్ పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రసాయనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ సేంద్రీయ పద్ధతులను అవలంబించడం వల్ల దీర్ఘకాలంలో స్థిరమైన, లాభదాయకమైన ఆదాయం లభిస్తుందని వివరించారు. మరోవైపు రోజురోజుకూ భూగర్భ జలాలు తరిగిపోతున్న నేపథ్యంలో సాగునీటిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. రైతులు సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను అలవర్చుకోవడం ద్వారా నీటిని ఆదా చేయవచ్చని, ఇది భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించడంలో ఎంతగానో దోహదపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్వేత, రైతులు పాల్గొన్నారు.



# రుణాలపై రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు అవగాహన సదస్సు

**పోతంగల్,మే 21(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని టాక్లి గ్రామం లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఏత్తోండ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ భూపేందర్ గారి అధ్యక్ష తన జరిగిన ఈ సదస్సులో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు, రైతులు, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్ భూపేందర్ గారు మాట్లాడుతూ "వ్యవసాయ రంగానికి సంబంధించిన రుణాలు, డ్వాక్రా మహిళా సంఘాలకు అందించే రుణ సౌకర్యాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా వంటి పథకాలపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలి. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి. సకాలంలో రుణాలు చెల్లించి మరింత రుణ సౌకర్యం పొందవచ్చు అని సూచించారు.

సర్పంచ్ మగరే పద్మావతి సాయికిరణ్ మాట్లాడుతూ బ్యాంకు అధికారులు గ్రామానికి వచ్చి రైతులకు, కూలీలకు, మహిళలకు అవగాహన కల్పించడం అభినందనీయం. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి" అని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాంబ్లే సురేఖ జ్యోతిపాల్, క్యాషియర్ జాన్ ల్యాక్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**నాగారం, మే 21(డిడి9 వార్త):**

ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ లో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి సూచించారు. నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు, నకిలీ ఓటర్ల వివరాలను బీఎల్ఓలకు అందించి అక్రమ ఓట్ల తొలగింపుకు సహకరించాలని కోరారు. దేశ భద్రత దృష్ట్యా ప్రతి నాయకుడు బూత్ స్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.



# కోపంలో హద్దుమీరిన హార్దిక్ పాండ్యాకు భారీ జరిమానా!

- **ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన హార్దిక్ పాండ్యా**
- **మ్యాచ్ ఫీజులో 10 శాతం కోతతో పాటు అతని ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్**
- **కేకేఆర్‌తో మ్యాచ్‌లో వికెట్ల బెయిల్స్‌ను గట్టిగా కొట్టిన వైనం**
- **తన తప్పును అంగీకరించి, మ్యాచ్ రిఫరీ శిక్షను అంగీకరించిన హార్దిక్**



**డిడి9 వార్త :**

ముంబై ఇండియన్స్ (ఎంఐ) కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు ఐపీఎల్ యాజమాన్యం జరిమానా విధించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను ఖాతాలో జతచేసింది.

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ 10వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. బౌలింగ్ రనప్ కోసం వెళ్తూ హార్దిక్ పాండ్యా కోపంగా వికెట్ల బెయిల్స్‌ను చేత్తో గట్టిగా కొట్టి పడగొట్టాడు. ఇది ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.2 ప్రకారం 'క్రికెట్ పరికరాలను దుర్వినియోగం చేయడం' కిందకు వస్తుందని ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. మ్యాచ్ రిఫరీ రాజీవ్ సేథ్ విధించిన ఈ శిక్షను హార్దిక్ అంగీకరించాడు.

ఇక మ్యాచ్ విషయానికొస్తే, ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ ఈ మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబైని కేకేఆర్ బౌలర్లు 147/8 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం 148 పరుగుల లక్ష్యాన్ని కేకేఆర్ మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. మనీశ్ పాండే, రోవ్‌మన్ పావెల్ కీలక భాగస్వామ్యంతో తమ జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విజయంతో కేకేఆర్ తమ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.

మ్యాచ్ అనంతరం హార్దిక్ మాట్లాడుతూ.. "పవర్‌ప్లేలో ఎక్కువ వికెట్లు కోల్పోవడం మా ఓటమికి కారణమైంది. ఇలాంటి బౌలర్లకు అనుకూలించే పిచ్‌లపై ఆడటాన్ని నేను ఆస్వాదిస్తాను. ఐపీఎల్‌లో బ్యాటర్ల ఆధిపత్యం పెరిగిపోతున్న తరుణంలో ఇలాంటి వికెట్లు బౌలర్లకు కూడా అవకాశం కల్పిస్తాయి" అని వ్యాఖ్యానించాడు.

# రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ అనుమానాలు.. వరల్డ్ కప్‌కు కష్టమేనా?

- **రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై బీసీసీఐ వర్గాల్లో ఆందోళన**
- **ఆఫ్ఘన్ సిరీస్‌కు ఫిట్‌నెస్ టెస్ట్ ఆధారంగానే ఎంపిక**
- **40 ఏళ్లకు దగ్గరవుతుండటంతో పెరుగుతున్న గాయాల భయాలు**
- **ఫిట్‌నెస్‌లో కోహ్లీతో రోహిత్‌ను పోల్చలేమంటున్న వర్గాలు**
- **వరల్డ్ కప్ కోసం అదనపు ఓపెనర్ల వేటలో సెలక్టర్లు**

**డిడి9 వార్త:**

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి రోహిత్ వన్డే ఫార్మాట్‌కు సరిపోయేలా ఫిట్‌గా ఉంటారా? లేదా? అనే అనుమానాలు ఉన్నట్లు సమాచారం. ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు రోహిత్‌ను ఎంపిక చేసినా ఆయన ఆడటం మాత్రం పూర్తిగా ఫిట్‌నెస్ టెస్ట్ పాస్ అవడంపైనే ఆధారపడి ఉంటుందని చర్చ జరుగుతోంది.

**50 ఓవర్లు ఆడగలడా?**

ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్ 2026 మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలో రోహిత్ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. వయసు 40 ఏళ్లకు దగ్గరపడుతుండటంతో గాయాల నుంచి కోలుకోవడానికి శరీరం ఎక్కువ సమయం తీసుకుంటుందని బోర్డు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఉన్నట్లు వన్డేల్లో ఇంపాక్ట్ ప్లేయర్ ఆప్షన్ ఉండదని, మైదానంలో 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేయడం రోహిత్ శరీరానికి భారంగా మారే అవకాశం ఉందని సెలక్టర్లు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.

**కోహ్లీతో పోలిక వద్దు**

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను ఇకపై ఒకేలా చూడలేమని బీసీసీఐ వర్గాలు అంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం కోహ్లీ ఫిట్‌నెస్, ఫామ్ మిగతా క్రికెటర్ల కంటే చాలా మెరుగ్గా ఉన్నాయని సమాచారం. మరోవైపు రోహిత్ శర్మ గతంలోలా దూకుడుగా ఆడకపోవడంపై కూడా టీమ్ మేనేజ్‌మెంట్ అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే రోహిత్ విషయంలో బీసీసీఐ మెడికల్ టీమ్‌తో చర్చించి ఒక గట్టి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చర్చ నడుస్తోంది.



**ప్రత్యామ్నాయ ఓపెనర్ల వేట**

రోహిత్ శర్మ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడంతో సెలక్టర్లు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌తో పాటు మరో బ్యాకప్ ఓపనర్‌ను సిద్ధం చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇషాన్ కిషన్‌ను కూడా ఓపనర్‌గా పరిశీలిస్తున్నట్లు సమాచారం. వరల్డ్ కప్ నాటికి కీలక ఓపెనర్లు ఎవరైనా గాయపడితే ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో బోర్డు ముందే అప్రమత్తమైనట్లు క్రికెట్ వర్గాలు చెబున్నాయి.

# ఒకే బెర్త్ కోసం ఐదు జట్ల పోటీ.. ఉత్కంఠగా మారిన ప్లేఆఫ్స్ సమీకరణాలు!

- **ముంబైపై కోల్‌కతా విజయంతో రసవత్తరంగా మారిన ప్లేఆఫ్స్ రేసు**
- **నాలుగో ప్లేఆఫ్ స్థానం కోసం ఐదు జట్ల మధ్య తీవ్ర పోటీ**
- **రాజస్థాన్ రాయల్స్‌కు 50% అవకాశాలున్నాయన్న స్టార్ స్పోర్ట్స్**
- **మిగతా జట్ల క్వాలిఫికేషన్ నెట్ రన్ రేట్‌పై ఆధారపడే అవకాశం**

**డిడి9 వార్త :**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లేఆఫ్స్ రేసు మరింత ఉత్కంఠభరితంగా మారింది. నిన్న ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) 4 వికెట్ల తేడాతో విజయం సాధించడంతో చివరిదైన నాలుగో ప్లేఆఫ్ స్థానం కోసం పోటీ తీవ్రమైంది. ఈ గెలుపుతో కోల్‌కతా తన ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోగా, ప్రస్తుతం ఒకే ఒక్క స్థానం కోసం ఏకంగా ఐదు జట్లు పోటీలో నిలిచాయి.


**స్టార్ స్పోర్ట్స్ విశ్లేషణ ప్రకారం..**

ప్రస్తుత సమీకరణాలను బట్టి, మిగిలిన ఒకే ఒక్క ప్లేఆఫ్ స్థానం కోసం పోటీ పడుతున్న జట్ల అవకాశాలపై స్టార్ స్పోర్ట్స్ ఒక విశ్లేషణను విడుదల చేసింది. దీని ప్రకారం, రాజస్థాన్ రాయల్స్‌కు (ఆర్ఆర్) ప్లేఆఫ్స్ చేరే అవకాశాలు అత్యధికంగా 50 శాతం ఉన్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) జట్లకు చెరో 19 శాతం అవకాశాలుండగా, ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) అవకాశాలు 9 శాతంగా ఉన్నాయి. ఇక చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కేవలం 3 శాతం అవకాశాలతో అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో ఉంది.

**ఏ జట్టు ఎలా క్వాలిఫై అవుతుంది?**

రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్): ఐదు జట్లలో రాజస్థాన్‌కే మంచి అవకాశాలున్నాయి. ముంబై ఇండియన్స్‌తో జరగబోయే తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే చాలు 16 పాయింట్లతో నేరుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఓడిపోతే, కేకేఆర్, పీబీకేఎస్, సీఎస్‌కే, డీసీ జట్లు తమ చివరి మ్యాచ్‌లలో ఓడిపోవాలని కోరుకోవాలి. ఆర్ఆర్ ఓడి, సీఎస్‌కే, డీసీ గెలిస్తే పాయింట్లు సమానమై నెట్ రన్ రేట్ (ఎన్ఆర్ఆర్) కీలకం అవుతుంది.

పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్): పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో తప్పక గెలవాలి. అదే సమయంలో కేకేఆర్, ఆర్ఆర్ జట్లు ఓడిపోవాలి. ఒకవేళ రాజస్థాన్ గెలిస్తే పంజాబ్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది. ఆర్ఆర్ ఓడి, పంజాబ్, కోల్‌కతా రెండూ గెలిస్తే, మూడు జట్ల మధ్య నెట్ రన్ రేట్ ఆధారంగా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది.



కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్): పంజాబ్ తరహాలోనే కోల్‌కతా కూడా తమ చివరి మ్యాచ్‌లో గెలవాలి. అలాగే పంజాబ్, రాజస్థాన్ ఓడిపోవాలి. రాజస్థాన్ గెలిస్తే కేకేఆర్ కూడా ఇంటిముఖం పడుతుంది. ఒకవేళ పంజాబ్ గెలిస్తే, ఇరు జట్ల మధ్య పాయింట్లు సమానమై నెట్ రన్ రేట్ నిర్ణయాత్మకంగా మారుతుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ): ఢిల్లీ మార్గం అత్యంత కఠినమైనది. వారు తమ చివరి మ్యాచ్‌లో గెలవడమే కాకుండా, కేకేఆర్, పీబీకేఎస్, ఆర్ఆర్, సీఎస్‌కే జట్లన్నీ తమ చివరి మ్యాచ్‌లలో ఓడిపోవాలి. ఆర్ఆర్, పీబీకేఎస్, కేకేఆర్ లలో ఏ ఒక్క జట్టు గెలిచినా ఢిల్లీ అవకాశాలు ముగిసిపోతాయి. సీఎస్‌కే గెలిచిన పక్షంలో ఎన్ఆర్ఆర్ లెక్కలోకి వస్తుంది.

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే): చెన్నై ప్లేఆఫ్స్ చేరాలంటే అద్భుతాలు జరగాలి. తమ చివరి మ్యాచ్‌లో భారీ తేడాతో గెలవడంతో పాటు కేకేఆర్, పీబీకేఎస్, డీసీ, ఆర్ఆర్ జట్లు ఓడిపోవాలి. ఒకవేళ కేకేఆర్, ఆర్ఆర్, పీబీకేఎస్ ఓడి, డీసీ గెలిస్తే, చెన్నై పాయింట్లు డీసీ, ఆర్ఆర్ లతో సమానమవుతాయి. అప్పుడు నెట్ రన్ రేట్ ఆధారంగా ప్లేఆఫ్స్ బెర్త్ ఎవరిదో తేలుతుంది.

# చేతులెత్తేసిన ప్రసార భారతి.. భారత్‌లో ఫిఫా ప్రసారాలు కష్టమేనా?.. తీవ్ర నిరాశలో ఫ్యాన్స్!

- **ఫిఫా వరల్డ్ కప్ 2026 ప్రసారాలపై భారత్‌లో కొనసాగుతున్న అనిశ్చితి**
- **ప్రసార హక్కుల బాధ్యత తమది కాదని ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ప్రసార భారతి**
- **అమెరికా, మెక్సికో, కెనడాలో మ్యాచ్‌లు కావడంతో అర్ధరాత్రి దాటాక ప్రసారాలు**
- **భారీ వ్యూయర్‌షిప్ ఉన్నప్పటికీ బ్రాడ్‌కాస్టర్ల నుంచి ఆసక్తి కరవు**
- **జూన్ 12న టోర్నీ ప్రారంభం కానుండటంతో అభిమానుల్లో పెరుగుతున్న టెన్షన్**

**డిడి9 వార్త :**

ఐపీఎల్ ముగింపు దశకు చేరడంతో భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద ఫుట్‌బాల్ సమరంపై పడింది. ఫిఫా వరల్డ్ కప్ 2026కి సమయం దగ్గర పడుతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్ 12 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుండగా, భారత్‌లో దీని ప్రసారాలపై మాత్రం తీవ్ర గందరగోళం నెలకొంది. టోర్నమెంట్ మొదలవడానికి కేవలం మూడు వారాల సమయం మాత్రమే ఉన్నప్పటికీ, ఇంతవరకు ఏ బ్రాడ్‌కాస్టర్ కూడా టెలివిజన్ ప్రసార హక్కులను ఖరారు చేసుకోలేదు. ఈ అనిశ్చితి ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

**ప్రసార హక్కులను పొందడం తమ బాధ్యత కాదన్న ప్రసార భారతి**

ఈ గందరగోళానికి మరింత ఆజ్యం పోస్తూ, ప్రభుత్వ రంగ ప్రసార సంస్థ ప్రసార భారతి కూడా చేతులెత్తేసింది. ఫిఫా వరల్డ్ కప్ ప్రసార హక్కులను పొందడం తమ బాధ్యత కాదని ఢిల్లీ హైకోర్టుకు స్పష్టం చేసింది. దీంతో దేశంలోని కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానుల్లో నిరాశ రెట్టింపయింది. సంప్రదాయ ఫుట్‌బాల్ ప్రియులతో పాటు యువతరం కూడా ఈ మెగా ఈవెంట్‌ను ఎలా చూడాలనే దానిపై స్పష్టత లేకుండా పోయింది.

**చైనా తర్వాత అత్యధిక వీక్షకులు మన దేశం నుంచే**



నిజానికి భారత్‌లో క్రికెట్‌కు ఉన్నంత ఆదరణ ఫుట్‌బాల్‌కు లేకపోయినా, ఫిఫా వరల్డ్ కప్ సమయంలో దేశవ్యాప్తంగా ఫుట్‌బాల్ ఫీవర్ కనిపిస్తుంది. గోవా, కేరళ, కోల్‌కతా వంటి ప్రాంతాల్లోనే కాకుండా దేశమంతటా ఈ సందడి నెలకొంటుంది. 2022లో ఖతార్‌లో జరిగిన వరల్డ్ కప్‌ను భారత్‌లో దాదాపు 745 మిలియన్ల మంది వీక్షించారు. ప్రపంచంలో చైనా తర్వాత అత్యధిక వీక్షకులు మన దేశం నుంచే ఉన్నారు. ఇంత పెద్ద మార్కెట్ ఉన్నప్పటికీ, బ్రాడ్‌కాస్టర్లు ముందుకు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

**మొత్తం 48 జట్లు.. 104 మ్యాచ్ లు**

ఈసారి అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నాయి. మొత్తం 48 జట్లు, 104 మ్యాచ్‌లతో ఈ టోర్నీ గతంలో కంటే భారీగా జరగనుంది. అయితే, బ్రాడ్‌కాస్టర్లు వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం మ్యాచ్ సమయాలు. ఆయా దేశాల టైమ్ జోన్‌ల ప్రకారం చాలా మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమవుతాయి. జులై 20న జరిగే ఫైనల్ మ్యాచ్ కూడా భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12:30 గంటలకు మొదలయ్యే అవకాశం ఉంది. మొత్తం 104 మ్యాచ్‌లలో కేవలం 14 మ్యాచ్‌లు మాత్రమే అర్ధరాత్రి లోపు ప్రారంభం కానున్నాయి. ఈ కారణంగానే ప్రసార హక్కుల విషయంలో బ్రాడ్‌కాస్టర్లు విముఖత చూపుతు

